# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో


వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 193 బుధవారం 17 జనవరి 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri

# పదవులకు వేళాయెరా...

రెండు ఎమ్మెల్సీ స్థానాలకు గానూ అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ పేర్లను కాంగ్రెస్ ఫైనల్

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల్లో జోష్

ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల్లో జోష్ కనిపిస్తోంది. నాయకులను నామినేటెడ్ పోస్టులు ఊరిస్తున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టిపెట్టింది. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి కష్టపడిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తొలి విడతగా పది మందికి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. సంక్రాంతి పండుగ తర్వాత ఆయా పదవులు దక్కిన నేతల పేర్లను అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. లోక్ సభ ఎన్నికల్లోపు నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ నిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

-3లో




## రాహుల్ నోట అదే పాత పాట

- రామ మందిర కార్యక్రమం...
- మోదీ రాజకీయ కార్యక్రమం'
- బీజేపీ పనిగట్టుకొని రాజకీయం కోసమే రామ మందిర ప్రారంభోత్సవం నిర్వహించటం సరికాదు
- అటువంటి రాజకీయ ప్రారంభోత్సవానికి హాజరుకావద్దు

# తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం


- తెలంగాణ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యం..
- వరుస భేటీలతో దావోస్‌లో రేవంత్ బిజీ
- ఫార్మా, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లో ఒప్పందాలు
- రేపు కృత్రిమ మేధపై చర్చలో పాల్గొననున్న రేవంత్
- అప్‌డేట్స్ ఇస్తున్న తెలంగాణ సీఎంవో



దావోస్

దావోస్ పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్న తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అవుతున్నారు. ప్రపంచ ఆర్థికవేదిక సదస్సు అధ్యక్షుడు బ్రెండి బోర్గ్, ఇథియోపియా డిప్యూటీ పీఎం మేకొనెన్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, నైపుణ్య వృద్ధి వంటి అవకాశాలపై చర్చించారు.

ఒప్పందాలపై సంతకాలు : ఫార్మా, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, డిఫెన్స్, ఏరోస్పేస్, ఆహారశుద్ధి, పునరుత్పాదక -మిగతా3లో



# ఐదుగురు అధికారుల్లో టెన్షన్


- రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం!
- ఆర్కియాలజీలో బుద్ధభవన్ ప్రాజెక్ట్ చూస్తున్న రిటైర్డ్ ఆఫీసర్ శివనాగిరెడ్డి
- ప్రోటోకాల్ అధికారిగా ఉన్న రిటైర్డ్ ఐపీఎస్ అరవింద సింగ్
- ఎండోమెంట్స్‌లో ఉన్న రిటైర్డ్ అధికారి అనిల్ కుమార్
- రెండేళ్ల ఎక్స్ టెన్షన్‌తో పనిచేస్తున్న ఐఏఎస్ రాణి కుముదిని.

హైదరాబాద్

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఉద్యోగం నుంచి రిటైరయ్యాక కూడా పలు హోదాల్లో కొనసాగుతున్న అధికారులపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. వారి గురించి ఆరా తీస్తోంది. ఈ నేపథ్యంలో వారికి వివిధ శాఖల్లో కొనసాగింపు ఉంటుందా? లేదా? అనే సస్పెన్స్ మొదలైంది. వివరాల ప్రకారం.. తెలంగాణ ప్రభుత్వం రిటైరయ్యాక కూడా పలు హోదాల్లో -మిగతా3లో

# తెలంగాణలో బీజేపీ ప్లాన్ 'బీ'.. టార్గెట్ బీఆర్ఎస్!

- కేంద్రంలో మోదీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధిస్తుందన్న నమ్మకంతో ఉంది కాషాయసేన.
- కనీసం పార్లమెంట్ ఎన్నికల్లో అయినా పుంజుకోవాలని ఆశిస్తోన్న బీజేపీ
- మోదీ పేరు చెప్పుకుని తెలంగాణలో ఇతర పార్టీల నుంచి నేతలను ఆకర్షించడానికి ప్లాన్
- భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యూహాలు




హైదరాబాద్

దేశమంతా చక్రం తిప్పుతున్న కమలం పార్టీ దక్షిణాదిన పాగా వేయలేకపోతోంది. తెలంగాణలో అధికారం వస్తుందన్న దశ నుంచి తిరో గమించింది. కనీసం పార్లమెంట్ ఎన్నికల్లో అయినా పుంజుకోవాలని ఆశిస్తోంది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధిస్తుందన్న నమ్మకంతో ఉంది కాషాయసేన. మోదీ పేరు చెప్పుకుని తెలంగాణలో ఇతర పార్టీల -మిగతా3లో



## సౌత్ కొరియా ఆక్రమణే లక్ష్యం?

- దక్షిణ కొరియాతో కలవడం ఇక ఎంత మాత్రం సాధ్యం కాదు
- మనం యుద్ధాన్ని కోరుకోవడం లేదు
- యుద్ధం వస్తే మాత్రం చేతులు ముడుచుకొని కూర్చోలేం
- మన రాజ్యాంగాన్ని మార్చాల్సి ఉంది.

# కార్పోరేషన్లు, బోర్డులలో పని చేస్తోన్న రిటైర్డ్ ఉద్యోగుల వివరాలు ఇవ్వండి

- సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు
- రిటైర్డ్ ఉద్యోగులను వివిధ స్థాయిలలో నియమించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- వివిధ శాఖలు, కార్పోరేషన్లు, బోర్డులలో పని చేస్తోన్న రిటైర్డ్ అధికారుల వివరాలు ఇవ్వాలని ఆదేశం
- ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి రేపు సాయంత్రం ఐదు గంటలలోగా ఇవ్వాలని ఆదేశం



హైదరాబాద్

వివిధ స్థాయిల్లో పని చేస్తోన్న మాజీ అధికారుల వివరాలు సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్త ర్వులు జారీ చేశారు. పదవీ విరమణ పొందిన పలువురు అధికారు లను గత ప్రభుత్వం వివిధ స్థాయిలలో నియమించింది. ఇలా పదవీ విరమణ తర్వాత కూడా వివిధ హోదాల్లో కొనసాగుతున్న వారిపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు -మిగతా3లో

# తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం

-మొదటి పేజి తరువాయి


ఇంధన రంగాల్లో పెట్టుబడులే లక్ష్యంగా దావోస్ లో అడుగుపెట్టిన సీఎం రేవంత్ బృందం పలుదేశాలకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు, సీఈవోలతో ఒప్పందాలు చేసుకోనుంది. అలాగే, నోవార్టిస్, ఆస్ట్రాజనిక్, గూగుల్, మెడ్‌ట్రానిక్స్, మాస్టర్‌కార్డ్, ఉబెర్, ఎల్డీసీ, బేయర్, యూపీఎల్ కంపెనీ ప్రతినిధులతో రేవంత్ భేటీ అవుతారు. మన దేశానికే చెందిన టాటా, విప్రో, జేఎస్‌డబ్ల్యూ, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, ఎయిర్‌టెల్, గోద్రెజ్, బజాజ్, నాస్కాం, సీసీఐ ప్రతినిధులతో చర్చలు జరుపుతారు.

### ఏఐతో హెల్త్ డేటాబేస్

కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించి వైద్యారోగ్య రంగంలో ప్రజల హెల్త్ డేటాబేస్‌ను రూపొందించే కీలక అంశంపై రేపు (బుధవారం) చర్చ జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు యూరోపియన్ యూనియన్ కమిషన్ ఆరోగ్య ఆహార కమిషనర్, జెనీవా వరల్డ్ ఎకనమిక్ ఫోరం సెంటర్ ఫర్ హెల్త్ అధినేత, ఆక్సియోస్ చీఫ్ ఎడిటర్, రువాండా ఐటీ మంత్రి, మయోక్లినిక్ సీఈవో, టుకడీ ఫార్మా కంపెనీ సీఈవో తదితరులు పాల్గొంటారు.

### ఎప్పటికప్పుడు అప్‌డేట్స్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనకు సంబంధించి



తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం, సీఎం రేవంత్‌రెడ్డి అధికారిక ట్విట్టర్ ఖాతాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అందిస్తున్నాయి. దావోస్ పర్యటనలో రేవంత్ వెంట ఐటీమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల ప్రోత్సాహక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో ఉన్నతాధికారులు శేషాద్రి, అజిత్‌రెడ్డి ఉన్నారు.


### ప్రపంచ ఆర్థిక ఫోరమ్ అధ్యక్షుడితో రేవంత్ రెడ్డి సమావేశం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ ఆర్థిక ఫోరమ్ అధ్యక్షుడితో భేటీ అయ్యారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి దావోస్‌లో ఉన్నారు. పెట్టుబడులను సమీకరించేందుకు ఆయన వరుసగా పలువురితో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా ప్రపంచ ఆర్థిక ఫోరమ్ అధ్యక్షుడితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నాలుగో పారిశ్రామిక విప్లవ కేంద్రం... సీ4ఐఆర్ ఏర్పాటుపై సంయుక్త ప్రకటన చేశారు. బయో ఏషియా సదస్సులో ఫిబ్రవరి 28న సీ4ఐఆర్ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచ ఆర్థిక ఫోరం లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వ ఆలోచనలు ఉంటాయని తెలిపారు. ప్రపంచ ఆర్థిక ఫోరం భాగస్వామ్యంతో లక్ష్యాలను చాలా వేగంగా చేరుకోవచ్చునన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వరుసగా భేటీ అవుతూ బిజీబిజీగా గడుపుతున్నారు. మెడ్‌ట్రానిక్ సీఈఓతో భేటీలో రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు ఉన్నారు.

# పదవులకు వేళాయెరా...

**హైదరాబాద్:** తెలంగాణలో ఎమ్మెల్యేల ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ ఇద్దరు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. సీనియర్ అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ పేర్లను ఖరారు చేసింది. దీంతో, వీరిద్దరూ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలవనున్నారు. వివరాల ప్రకారం.. తెలంగాణలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు గానూ అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ పేర్లను కాంగ్రెస్ ఫైనల్ చేసింది. కాంగ్రెస్ ముఖ్య నేతలు వీరికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఇక, ఈనెల 18వ తేదీన ఎమ్మెల్సీ నామినేషన్లకు ఆఖరు తేదీ. 29న ఎన్నికలు జరగనున్నాయి. కాగా, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉండటంతో వీరి గెలుపు ఖాయంగా కనిపిస్తోంది.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల్లో జోష్ కనిపిస్తోంది. నాయకులను నామినేటెడ్ పోస్టులు ఊరిస్తున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టిపెట్టింది. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి కష్టపడిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తొలి విడతగా పది మందికి అవకాశం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. సంక్రాంతి పండుగ తర్వాత ఆయా పదవులు దక్కిన నేతల పేర్లను అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. లోక్ సభ ఎన్నికల్లోపు నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ నిర్ణయించినట్టు పార్టీ



వర్గాలు చెప్తున్నాయి. తద్వారా లోక్ సభ ఎన్నికల్లో పార్టీ నేతలను ప్రోత్సహించినట్లు ఉంటుందని, ఐదేళ్ల పాటు పార్టీని పటిష్టంగా ఉంచేందుకు ఈ పదవులు ఉపయోగపడతాయని కాంగ్రెస్ భావిస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే 10 నుంచి 15 మందితో ఓ లిస్టును తయారు చేసినట్టు కాంగ్రెస్ కీలక నేత ఒకరు తెలిపారు. నామినేటెడ్ పదవుల ఎంపికపై శుక్రవారం రాత్రి కీలక సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి తదితరులు ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పదవులకు సంబంధించి కసరత్తు చేసినట్టు చెప్పారు. కేసీ వేణుగోపాల్‌తో భేటీ సందర్భంగా ఆ లిస్టును సీఎం రేవంత్, దీపాదాస్ అందజేశారని తెలుస్తున్నది. ఆ లిస్టుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీలతో చర్చించి ఫైనల్ చేస్తారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.పదవుల జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకునేందుకు కొందరు నేతలు ప్రయత్నం ముమ్మరం చేశారు. ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల కోసం రాష్ట్ర సచివాలయం, గాంధీభవన్ చుట్టూ ఆశావహులు తిరుగుతున్నారు. సీఎం, మంత్రులకు విజ్ఞప్తులు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 54 కార్పొరేషన్ల చైర్మన్లు, ఆరు ఎమ్మెల్సీలు, మరో ఆరు మంత్రి పదవులు భర్తీ చేయాల్సి ఉన్నది.

అలాగే ఎమ్మెల్యే టికెట్ దక్కని అద్దంకి దయాకర్ వంటి నేతలకు అధిష్ఠానం ఎమ్మె ల్సీ హామీ ఇచ్చింది. దీంతో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ తీవ్రంగా నెలకొంది. వీటికి తోడు పార్టీకి చెందిన ఆర్గనైజేషన్ల చైర్మన్లు, పార్టీ అనుబంధ విద్యార్థి సంఘాల నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే టికెట్లను వదులుకున్న తమకు తొలి విడతలోనే అవకాశం దక్కుతుందని కొందరు నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ చాలా మంది ఏళ్ల తరబడి పార్టీనే అంటిపెట్టుకొని ఉన్నారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేశారు. అలాంటి నేతలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారికి మాత్రమే ఇవ్వాలనేది అధిష్ఠానం ఉద్దేశమని ప్రచారం జరుగుతోంది. పార్టీలోనే ఉంటూ పార్టీని దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వారిని, ఎన్నికల సమయంలో పార్టీ మారే ఆలోచన చేసిన వారిని పక్కన పెట్టాలని భావిస్తున్నట్టు తెలిసింది.


# రుణమాఫీ పై ప్లాన్ ఏ, ప్లాన్ బీ

**హైదరాబాద్ :** రైతు రుణమాఫీ ఎలా చేయాలనే దానిపై రేవంత్ సర్కార్ తర్జనభర్జన పడుతోంది. వైఎస్ రాజశేఖరరెడ్డి మాదిరి సింగిల్ స్ట్రోక్‌లో రుణమాఫీ చేయడమా? లేక రైతుల అప్పులకు బ్యాంకు గ్యారంటీ ఇవ్వడమా అనే దానిపై కసరత్తు మొదలు పెట్టింది. ఏదిఏమైనా సరే ఎన్నికలకు ముందు ఇచ్చిన రుణమాఫీ హామీని కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందననే పట్టుదలతో ఉన్నారు రేవంత్. రుణమాఫీ అమలు కోసం సర్కార్ ముందున్న ఆప్షన్స్ ఏంటనేది ఇప్పుడు ఇంట్రెస్టింగ్‌గా మారింది.తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులైంది. ఇప్పటికే ప్రజా పాలనలో ఐదు గ్యారంటీలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది సర్కార్. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 25 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో రుణమాఫీ కోసం సైతం రైతులు భారీగా దరఖాస్తు చేసుకున్నారని సమాచారం. రుణమాఫీ కోసం వచ్చిన దరఖాస్తులను షార్ట్ లిస్టు చేస్తున్న రేవంత్ సర్కార్ రుణమాఫీ అమలుపై ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. దీన్ని అమలు చేయాలంటే.. దాదాపు 30 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు అవసరమని అధికారుల అంచనా. దీంతో ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారు.రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే బ్యాంకర్లతో మాట్లాడారని తెలిసింది. ఒకేసారి మొత్తం రుణమాఫీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. దీనికోసం.. రెండు ఆప్షన్లు ఆలోచనలో ఉన్నట్లు టాక్. ఒకటి.. గతంలో వైఎస్ఆర్ హయాంలో చేసినట్టు ఒకే విడతలో రుణమాఫీ చేయడం. ఇలా చేయాలంటే ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ పేరు మీద రుణం తీసుకోవాలి. గతంలో కేసీఆర్ సర్కార్.. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి.. బ్యాంకుల నుంచి ఇలాగే రుణాలు తీసుకుంది. ఇదే ఫార్ములాను రుణమాఫీ కోసం అమలు చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.అయితే.. బ్యాంకులు అప్పులు ఇచ్చే ముందు.. తిరిగి ఎలా తీరుస్తారని అడుగుతాయి. రుణమాఫీ చేస్తే రైతుల నుంచి తిరిగి వసూలు చేసే పరిస్థితి ఉండదు. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సెస్‌ల రూపంలో నగదును రుణమాఫీ కార్పొరేషన్‌కు ఇవ్వనుంది. ఇలా చేస్తే బ్యాంకులు కూడా సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది. ఇలా రుణం పుడితే 30 వేల కోట్ల రూపాయలను నాలుగేళ్ళల్లో




ఈఏంఐల రూపంలో ప్రభుత్వం చెల్లించేలా రేవంత్ సర్కార్ ప్లాన్ చేస్తుందని సమాచారం. దీంతో ఏకకాలంలో రుణమాఫీ చేయడం ఈజీ అవుతుంది. గతంలో ఏపీలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రుణమాఫీ కోసం రైతు సాధికార సంస్థను ఏర్పాటు చేసి దాని ద్వారా రుణమాఫీ చేసిన అనుభవాన్ని కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. ఒకవేళ 30 వేల కోట్ల అప్పు ఏకకాలంలో పుట్టకపోతే అప్పుడు ప్లాన్ బి ని రెడీ చేస్తోందని సమాచారంఇక, గత కేసీఆర్ ప్రభుత్వం లక్ష రుణమాఫీ చేస్తామని హామి ఇచ్చింది. అయితే అది సకాలంలో చేయకపోవడంతో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి, రుణమాఫీపై బ్యాంకులకు గ్యారంటీ ఇచ్చి విడతల వారిగా రుణమాఫీ చేసింది. మొత్తం లక్ష రుణమాఫీకి సంబంధించి19 వేల కోట్లు ఉండగా ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు 13 వేల కోట్ల వరకు రుణమాఫీ జరిగింది. ఎస్.ఎల్.బీ.సి. ద్వారా ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ చేయనందుకు బ్యాంకులు.. ఇష్టారీతిగా రుణమాఫీ చేశాయి. ఒక్కో బ్యాంక్ ఒక్కో తీరున 25 వేల నుంచి 80 వేల వరకు రుణమాఫీ చేశాయి. దీంతో రుణమాఫీ పూర్తి కాకపోవడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకతను మూటగట్టుకుంది. అదే సమయంలో రైతులపై కొంత వడ్డీ భారం కూడా పడింది. పాత అప్పు తీరకపోవడం వల్ల కొత్త రుణాలు పుట్టకపోవడం వంటి గడ్డుపరిస్థితిని రైతులు ఎదుర్కోవాల్సి వచ్చిందిమరోసారి గ్యారంటీ ద్వారా రుణమాఫీ చేయాల్సిన పరిస్థితే వస్తే గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా ముందుకు వెళ్లాలని పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తుందట రేవంత్ సర్కార్. రుణమాఫీ మొత్తం అయ్యే వరకు.. వడ్డీని సైతం బ్యాంకులకు ప్రభుత్వమే చెల్లిస్తుందనే గ్యారంటీ కూడా ఇవ్వనుందని సమాచారం. అదే సమయంలో 2 లక్షల వరకు ఉన్న రైతు రుణం బాధ్యత ప్రభుత్వానిదే కాబట్టి.. కొత్త అప్పులకు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా ఆర్బీఐ తోనూ.. కేంద్రంతోనూ చర్చించేందుకు ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి బీఆర్ఎస్ ఓటమికి.. కాంగ్రెస్ గెలుపులో కీలకంగా పని చేసిన రైతు రుణమాఫీకి ఇప్పుడు సీఎం రేవంత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. రుణమాఫీని ఏకకాలంలో చేసి.. తమది రైతు పక్షపాత ప్రభుత్వంగా ముద్ర వేయించుకోవాలన్న యోచనలో ఉన్నారు సీఎం రేవంత్ రెడ్డి.

## ఐదుగురు అధికారుల్లో టెన్షన్..




-మొదటి పేజి తరువాయి

కొనసాగుతున్న అధికారులపై ఆరా తీస్తోంది. ఈ మేరకు రేపు(బుధవారం) సాయంత్రం ఐదు గంటలలోపు వారి ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో పలు శాఖల్లో ఉన్న వారి కొనసాగింపు ఉంటుందా? ఉండదా? అనే చర్చ మొదలైంది. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. అయితే, ప్రస్తుతం కొత్త సర్కార్ ఫోకస్‌లో ఐదుగురు అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది.

**ఐదుగురు అధికారులు వీరే..**


MCRHRDITలో సలహాదారుగా ఉన్న రిటైర్డ్ IFS తిరుపతయ్య
ఆర్కియాలజీలో బుద్ధభవన్ ప్రాజెక్ట్ చూస్తున్న రిటైర్డ్ ఆఫీసర్ శివనాగిరెడ్డి
ప్రోటోకాల్ అధికారిగా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అరవింద సింగ్
ఎండోమెంట్స్‌లో ఉన్న రిటైర్డ్ అధికారి అనిల్ కుమార్
రెండేళ్ల ఎక్స్ టెన్షన్‌తో పనిచేస్తున్న ఐఏఎస్ రాణి కుముదిని.

## కార్పోరేషన్లు, బోర్డులలో పని చేస్తోన్న రిటైర్డ్ ఉద్యోగుల వివరాలు ఇవ్వండి:

-మొదటి పేజి తరువాయి

జారీ చేశారు. వివిధ శాఖలు, కార్పోరేషన్లు, బోర్డులలో పని చేస్తోన్న వారి వివరాలను ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి బుధవారం సాయంత్రం ఐదు గంటలలోపు నిర్ణీత నమూనాలో వివరాలు ఇవ్వాలని ముఖ్య కార్యదర్శులు, శాఖాధిపతులను ఆదేశించారు.

## తెలంగాణలో బీజేపీ ప్లాన్ 'బీ'.. టార్గెట్ బీఆర్ఎస్!




-మొదటి పేజి తరువాయి

నుంచి నేతలను ఆకర్షించడానికి ప్లాన్ చేస్తోంది. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యూహాలు రచిస్తోంది. ఇంతకీ తెలంగాణ బీజేపీ అమ్ముల పొదిలో ఉన్న అస్త్రాలు ఏంటి?..

తెలంగాణలో బలం పెంచుకోవడానికి కమలం పార్టీ హైకమాండ్ పెద్ద స్కెచ్చే గీస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నేతలను ఆకర్షించేందుకు ఏర్పాటు చేసిన చేరికల కమిటీని మళ్లీ ఏర్పాటు చేస్తోంది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఈటల రాజేందర్ నేతృత్వంలో జాయినింగ్స్ కోసం ప్రత్యేకంగా సమన్వయ కమిటీ ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో డబుల్ డిజిట్ పార్లమెంట్ సీట్లు సాధించడమే లక్ష్యంగా కమలనాథులు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు టచ్‌లో ఉన్నారని బీజేపీ నేతలు చెబుతున్నారు. బీజేపీలో ఇప్పటికే కొన్ని పార్లమెంట్ స్థానాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. మల్కాజిగిరి, జహీరాబాద్, మెదక్, హైదరాబాద్ ఎంపీ టికెట్ల కోసం బీజేపీలో గట్టిపోటీ నెలకొంది. కొత్తగా బీజేపీలో చేరే ఆ సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీలు ఎవరు? వాళ్లు వస్తే తమ భవిష్యత్ ఏంటీ? అనేదానిపై పార్టీలో నేతల మధ్య విస్తృత చర్చ సాగుతోంది.

తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ చాలాకాలం నుంచి కలలు కంటోంది. కానీ, అసెంబ్లీ ఎన్నికల్లో డబుల్ డిజిట్ సీట్లు కూడా రాలేదు. దానికి అనేక కారణాలున్నాయని పార్టీలోనే చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు రాకపోయినా.. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తాజాగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పార్లమెంటు ఎన్నికలతో పాటు ఆ తర్వాత వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సత్తా చాటేందుకు కసరత్తు ప్రారంభించింది. బీఆర్ఎస్‌లోని ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని బీజేపీలోకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. స్థానిక సంస్థల్లో బలోపేతమైతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగే అవకాశాలున్నాయని కమలనాథులు లెక్కలు వేస్తున్నారు. బండి సంజయ్, ఈటల రాజేందర్ నేతృత్వంలో వేసిన చేరికల కమిటీ ముందు బీజేపీ హైకమాండ్ పెద్ద టార్గెట్ పెట్టినట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా త్వరలోనే జరిగే అవకాశం ఉందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటే విధంగా పనిచేయాలని అందుకు తగ్గట్టుగా సిద్ధం కావాలని కమలం పార్టీ డిసైడ్ అయింది. అందులో భాగంగానే క్రింది స్థాయి నేతలను భారీగా చేర్చుకోవాలని పార్టీ స్కెచ్ వేస్తోంది. మరి బీజేపీ వైపు గులాబీ పార్టీ నేతలు ఏ మేరకు మొగ్గు చూపుతారో చూడాలి.

## సీపీఎం తమ్మినేని వీరభద్రంకు గుండెపోటు




**హైదరాబాద్:** సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గుండె పోటుకు గురయ్యారు. దీంతో, మెరుగైన వైద్యం కోసం తమ్మినేనిని వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. ఇక, గతంలోనే తమ్మినేని స్ట్రోక్ రావడంతో స్టంట్ కూడా పడింది. వివరాల ప్రకారం.. సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం గుండె పోటు కారణంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తన స్వగ్రామం తెల్దారపల్లిలో ఉన్న సమయంలోనే తమ్మినేని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో, ఆయనను వెంటనే ఖమ్మం?లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో లంగ్స్ ఇన్ఫెక్షన్‌తో పాటు మైల్డ్ హార్ట్ స్ట్రోక్ లక్షణాలను వైద్యులు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఈ నేపథ్యంలో అంబులెన్స్‌లో తమ్మినేనిని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. గతంలో తమ్మినేనికి స్ట్రోక్ వచ్చిన నేపథ్యంలో అప్పుడు ఆయనకు వైద్యులు స్టంట్ వేశారు. తాజాగా మరోసారి మైల్డ్ స్ట్రోక్ రావడంతో పరిస్థితి కొంచెం విషమంగా మారింది.

## సంపాదకీయం

# బిల్కిస్ బానో కేసులో 'సుప్రీం' తీర్పు

మొత్తం దేశ ప్రజలు ఒక వంక అయోధ్యలో భవ్యమైన రామ మందిరంలో శ్రీరాముడి విగ్రహ 'ప్రాణ ప్రతిష్ట' సంబరాలలో తేలియాడుతున్న సమయంలో బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషుల శిక్షా కాలాన్ని తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న చట్ట విరుద్ధమైన నిర్ణయాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఒక విధమైన గగుర్పాటుకు గురి చేస్తుంది. ఇప్పటి వరకు నిందితులను కాపాడేందుకు అసాధారణమైన అధికార బలాన్ని ఉపయోగించుకొని ప్రయత్నాలు చేస్తున్న వారికి తీవ్రమైన భంగపాటు అని చెప్పవచ్చు. శ్రీరాముడు అంటేనే మనకు 'ఏకపత్నీవ్రతుడు' గుర్తుకు వస్తారు. నైతిక విలువలకు అంతకన్నా మరో సజీవ ఉదాహరణ మనముందుండదు. అటువంటి యుగ పురుషుడిని స్మరించుకొంటున్న సమయంలో ఒక నిస్సహ మహిళ న్యాయం కోసం రెండు దశాబ్దాలకుపైగా న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడడం, బలమైన శక్తులు ఆమెకు వ్యతిరేకంగా పని చేస్తుండడం మొత్తం జాతికి ఓ విధమైన సిగ్గుచేటైన విషయం.
కండబలం, ధనబలం ముందు వ్యవస్థలు సాగిలపడుతున్న సమయంలో న్యాయం కోసం సాధారణ ప్రజలకు దిక్కుతోచని స్థితిలో చీకట్లో చిరుదీపం మాదిరిగా సుప్రీం కోర్టు తీర్పు ఆ మహిళకు ఆసరాగా నిలబడినదని చెప్పవచ్చు. న్యాయస్థానాలు బలహీనులకు న్యాయం అందించడం కోసమే అని చెబుతున్నా ఆచరణలో చాలా తక్కువ సందర్భాలలో మాత్రమే సామాన్యులు న్యాయస్థానం ద్వారా న్యాయం పొందగలుగుతున్నారు. 2002 గుజరాత్ మారణ హోమం సమయంలో అయిదు నెలల గర్భవతి అయిన బిల్కిస్ బానోపైన, ఆమె కుటుంబ సభ్యులపైన సామూహిక అత్యాచారానికి పాల్పడడం, మూడేళ్ళ ఆమె కుమార్తెతో సహా 14 మందిని మూకుమ్మడిగా చంపేసిన కేసు రెండు దశాబ్దాలుగా కలకలం రేపుతూనే ఉంది. రాజకీయంగా, సామాజికంగా బలమైన వర్గాలు ఈ కేసును కప్పిపుచ్చేందుకు ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయితే సుప్రీం కోర్టు జోక్యంతోనే మొదటి నుండి బాధితురాలికి ఉపశమనం కలిగించే ప్రయత్నం జరుగుతూ వస్తున్నది. మొదటగా సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని ఆంధ్రప్రదేశ్ పోలీస్ క్యాడర్‌కు చెందిన అప్పటి సిబిఐ జాయింట్ డైరెక్టర్ వివేక్ దూబే నేతృత్వంలో ఏర్పర్చిన సిట్ అత్యంత సాహసోపేతంగా, నిజాయితీతో వ్యవహరించి బాధితులను చట్టం ముందుకు తీసుకు రాగలిగింది. బాధితురాలి భయపడుతున్న వాతావరణంలో వారిలో ఆత్మవిశ్వాసం కలిగించి కేసు దర్యాప్తును ముందుకు తీసుకు వెళ్లడం అంత తేలికైన వ్యవహారం కాబోదు. వివేక్ దూబే బృందం నిర్భయంతో ఎటువంటి వత్తిడులకు లొంగకుండా నిజాయితీతో వ్యవహరించిన కారణంగానే 11 మంది బాధితులకు జీవిత శిక్షపడింది. అయితే, ఎటువంటి సంశయం లేకుండా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ముందు దోషులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదిస్తూ, శిక్షా కాలాన్ని తగ్గించి ముందస్తుగానే విడుదల చేసింది. 2022 ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా దోషులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడంపై అప్పట్లో పెద్ద యెత్తున విమర్శలు వచ్చాయి. జైలు నుండి విడుదల సందర్భంగా వారేదో 'ఘనకార్యం' సాధించి వస్తున్నట్లు వారికి లభించిన స్వాగత సత్కారాలు మొత్తం సభ్య సమాజాన్ని విస్మయానికి గురిచేశాయి. బాధితురాలు ధైర్యం చేసి సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఇప్పుడు ఈ సంచలన తీర్పు వెలువడింది. ఒక వంక దేశంలో మహిళలకు సొంత ఇళ్లలో, వారు పని చేసే చోటనే భద్రత కరువవుతోందని, వారిపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన చెందుతున్న సమయంలో దారుణమైన అకృత్యాలకు పాల్పడిన వారికి మద్దతుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడటం, వారిని కాపాడేందుకు అత్యున్నత న్యాయవాదులను రంగంలోకి దింపడం సిగ్గుచేటైన అంశం. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు నిత్యం మహిళల పట్ల సానుభూతి ఒలకబోస్తూ, వారి రక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాజకీయ వేత్తలకు, పాలకులకు చెంపపెట్టు కాగలదని ఆశిద్దాము. శిక్ష తగ్గింపు ఆదేశాలను సమర్ధించుకోవడానికి వాస్తవాలను అందజేయడంలో గుజరాత్ ప్రభుత్వం మోసానికి పాల్పడిందని ధర్మాసనం పేర్కొనడం ఒక విధంగా ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభిశంసించడమే కాగలదు. నేరస్థులు మోసం చేసి శిక్షను తప్పించుకున్నట్టయితే, సమాజంలో శాంతి, భద్రతలు మిథ్యగా మారిపోతాయని సుప్రీం కోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదం ప్రాతిపదికనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గుజరాత్ ప్రభుత్వం చెప్పిన విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లైతే ఈ పాపంలో కేంద్ర ప్రభుత్వానికి కూడా సమాన వాటా ఉన్నట్లేనని సుప్రీం కోర్టు పేర్కొనడం గమనార్హం. నేరాల క్రూరత్వాన్ని, సమాజంపై వాటి విస్తృత పర్యవసానాలను, చట్టబద్ధ పాలనను వేటినీ పరిగణనలోకి తీసుకోకుండా నాగరిక ప్రభుత్వాలు నేరస్థులను కాపాడే ప్రయత్నం చేయడం విస్మయం కలిగిస్తోంది. ప్రభుత్వాలనేవి రాజ్యాంగబద్ధమైన సంస్థలు. ప్రభుత్వాలు తమ అధికార పరిధులను, చట్టాన్ని, న్యాయ వ్యవస్థను ఉల్లంఘించేలా వ్యవహరించినట్లైతే, అది మన ప్రజాస్వామ్య ఉనికినే ప్రమాదంలో పడేస్తుందని గమనించాలి. సుప్రీం కోర్టు తీర్పు పట్ల దేశం అంతటా హర్షామోదాలు వ్యక్తం అవుతూ ఉంటే గుజరాత్‌లోని రాజకీయ పార్టీలు మాత్రం మౌనం వహించడం విస్మయం కలిగిస్తోంది. కేవలం ఆప్ మాత్రమే స్పందించింది. ముఖ్యంగా నిందితులను కాపాడేందుకు విస్తృతంగా ప్రయత్నాలు చేసిన్నట్లు విమర్శలు ఎదుర్కొంటున్న బిజెపి నేతలు మౌనం వహిస్తున్నారు. నిందితులకు క్షమాభిక్ష కల్పించి విడుదల చేయాలని సిఫార్సు చేసిన జైలు సలహా కమిటీ సభ్యుడైన గోద్రా బిజెపి ఎంఎల్ఏ సికె రాహుల్ మాత్రం కోర్టు తీర్పు విషయంలో ఎటువంటి వ్యాఖ్యానం చేయలేనని తప్పించుకున్నారు. మొత్తం తీర్పు చదివిన తర్వాతనే ఏమైనా చెప్పగలను అన్నారు. 2022లో నిందితులను శిక్ష తగ్గించి విడుదల చేసినప్పుడు వారు 'మంచి సంస్కారాలు గల బ్రాహ్మణులు' అంటూ కొనియాడి పెనువివాదంలో ఆయన చిక్కుకున్నారు. మరోవంక, సుప్రీం కోర్టు ఆదేశం మేరకు ఈ కేసులో 11 మంది నిందితులు తిరిగి రెండు వారాలలో జైలుకు వేడతారా లేదా తప్పించుకు తిరుగుతారా? అనే చర్చ ఒక వంక జరుగుతుంది. అన్నింటికీ మించి నిందితులను కాపాడేందుకు నేరమయ దుర్మార్గానికి పాలపడిన వ్యవస్థలు, వ్యవస్థలలో బాధ్యులను జవాబుదారీగా చేసే విధంగా సుప్రీం కోర్టు తీర్పు దోహదం చేయకపోవడం దురదృష్టకరం. ఆ విధంగా జవాబుదారీగా చేయగలిగితే తప్ప ఇటువంటి నేరాలను కట్టడి చేయడం సాధ్యం కాదు. ఈ మధ్యనే చట్టసభలలో మహిళలకు మూడో వంతు సీట్లు రిజర్వ్ చేసే బిల్లుకు చట్టరూపం ఇవ్వడం ద్వారా 'మహిళా సాధికారికత' లో పెద్ద ముందడుగు వేస్తున్నామని భావించే రాజకీయ నాయకులు వారి రక్షణ పట్ల ఎంతటి ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో ఈ తీర్పు వెల్లడి చేస్తుందని చెప్పొచ్చు. అయితే అప్పుడప్పుడు కొన్ని కేసులలో సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత సంచలనాలు జరుగుతున్నప్పటికీ మన సమాజంలో మహిళలకు రక్షణ లభిస్తుందని ఆశింపలేము. ఢిల్లీలో 'నిర్భయ' ఉదంతం తర్వాత కఠినమైన చట్టాలు తీసుకు వచ్చాము. అత్యాచారం నేరానికి మరణ శిక్ష కూడా విధించే అవకాశం కల్పించాము. బాధితుల రక్షణ కోసం కేంద్రం ప్రత్యేకంగా ఓ నిధిని ఏర్పాటు చేసింది. అయినా దేశంలో ఇటువంటి కేసులసంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిధిని బాధితులకు అవసరమైనప్పుడు ఖర్చు చేస్తున్న సంకేతాలు ఏమాత్రం లేవు. ప్రతి కార్యాలయంలో మహిళలపై వేధింపుల ఫిర్యాదుల పరిశీలనకు ఓ కమిటీ ఉండాలని చట్టం ఉన్నప్పటికీ ఎన్నికార్యాలయాల్లో అటువంటి ఏర్పాట్లు అందుబాటులో ఉన్నాయి? కమిటీలు ఏర్పాటు చేసినా అవి ఏ మేరకు పని చేస్తున్నాయి? వేధింపులకు గురవుతున్న మహిళలు ఎందరు నిర్భయంగా ఫిర్యాదు చేయగలుగుతున్నారు? ఉన్నత స్థానాలలో ఉన్న మహిళలో ఎటువంటి విషయాలలో అభద్రతకు గురవుతూ ఉండటాన్ని చూస్తున్నాము. పోలీస్ సంస్కరణలను సూచిస్తూ సుప్రీం కోర్టు ఏనాడో ఇచ్చిన ఆదేశాలను ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్నాయి? శాంతిభద్రతలు, నేరపరిశోధనలను వేర్వేరు విభాగాలుగా చేయాలని సూచన అమలవుతున్నదా? డిజిపిల నియామకంలో, పోలీస్ అధికారుల బదిలీలలో రాజకీయ జోక్యం లేకుండా చేయగలుగుతున్నారా?

# ప్రపంచాన్ని కుదిపేయనున్న ముప్పులు



రానున్న రెండు సంవత్సరాల్లో భారత్, యూఎస్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, మెక్సికో, పాకిస్థాన్, యూకెలతో పాటు అనేక దేశాలు ఎన్నికలను నిర్వహించనున్నాయని, వీటిలో దాదాపు 3 బిలియన్ల ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ విడుదల చేసిన "గ్లోబల్ రిస్క్ రిపోర్ట్" అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. 2024లోనే దాదాపు 60 దేశాల్లో ఎన్నికలు జరుగనున్నాయని మనకు తెలుస్తున్నది. రానున్న రోజుల్లో సామాజిక మాద్యమాల్లో దుష్ప్రచారంతో పాటు తప్పుడు సమాచార వ్యాప్తి తక్షణ అతి పెద్ద సంక్షోభంగా అవతరించనుందని "గ్లోబల్ రిస్క్ రిపోర్ట్" నివేదిక హెచ్చరిస్తున్నది. పౌరసమాజ విభజనల పోటుతో ప్రపంచ దేశాలు అశాంతికి నెలవులుగా మారవచ్చని అంచనా వేసింది. 15 జనవరి 202న దావోస్‌లో ప్రారంభం కానున్న 5-రోజుల "వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్" సమావేశాల నేపథ్యంలో ప్రపంచాన్ని కుదుపేయనున్న సమస్యలను ఎదుర్కోవడానికి నవ సమాజం సిద్ధపడాలని నివేదిక స్పష్టం చేస్తున్నది. రానున్న దశాబ్దంలో ప్రపంచ మానవాళి ఆధిపత్య పోరులో విభేదాల కారణంగా అనేక సమూహాలుగా విభజించబడుతుందని కూడా తెలిపింది. 2023లో నిర్వహించిన సర్వేలో 1,400లకు పైగా గ్లోబల్ రిస్క్ నిపుణులు, పాలసీ మేకర్స్, ఇండస్ట్రీ నిపుణులల అభిప్రాయాల సేకరణతో 'గ్లోబల్ రిస్క్ రిపోర్ట్' అనే పేరుతో నివేదిక తయారు చేశారు.
రానున్న రెండేళ్లలో సోషల్ మీడియా దుష్ప్రచారాలతో పాటు అంటువ్యాధుల వ్యాప్తి, అక్రమ ఆర్థిక లావాదేవీలు, రానున్న ఐదేళ్లలో శ్రామిక వర్గాల కొరత, దశాబ్దంలో వాతావరణ ప్రతికూల మార్పులతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్న అవుతాయని నివేదిక స్పష్టం చేసింది. ఈ ప్రతికూల ప్రభావాలతో అసమానతలు పెరగడం, పేదరికం వెక్కిరించడం, సుస్థిరాభివృద్ధిలో కోత పడడం జరుగుతుందని తెలిపింది. సైబర్ సెక్యూరిటీ, దేశాల మధ్య విభేదాలతో సాయుధ పోరాటాల సంక్షోభాలు కూడా పెరుగుతాయని తెలిపింది. రానున్న పదేళ్లలో వాతావరణ మార్పులతో జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లడం, జీవ వ్యవస్థలు విచ్ఛిన్నం కావడం, సహజ వనరుల కొరత వెంటాడడం కూడా మానవాళి అనుభవంలోకి రావడం, ఆరోగ్యాలు హరించడం జరుగుతుందని వివరించబడింది. నివేదిక గుర్తించినఐదు స్వల్పకాలిక, దీర్ఘకాలిక సమస్యల్లో సామాజిక మాద్యమాల వేదికగా రానున్న ఎన్నికల్లో ప్రమాదకర దుష్ప్రచారాలు (డిస్‌ఇన్ఫర్‌మేషన్, మిస్‌ఇన్ఫర్‌మేషన్), ప్రకృతి ప్రకోపాలతో వాతావరణ ప్రతికూల మార్పులు, విభిన్న వర్గాలుగా పౌర సమాజ విభజనలు, సైబర్ సెక్యూరిటీ, దేశాల మధ్య సాయుధ సంఘర్షణలుప్రపంచ మానవాళిని కుదిపేయనున్నట్లు హెచ్చరించింది.
రానున్న రెండేళ్లలో స్వల్పకాలిక సంక్షోభాలుగా జీవన వ్యయాల పెరుగుదల, ప్రతికూల వాతావరణ మార్పులతో విధ్వంసాలు, దేశాల మధ్య విభేదాలతో సంఘర్షణలు/యుద్ధాలు, వాతావరణ మార్పుల కట్టడి చర్యలు, పౌర సమాజ అనారోగ్యకర విభజనలు, భారీ ఎత్తున పర్యావరణ విధ్వంసకర ప్రమాదాలు, వాతావరణ మార్పులకు అనుగుణంగా మారకపోవడం, అసంకల్పిత వలసల వరదలు, సైబర్ నేరాలు విపరీతంగా పెరగడం,సహజ వనరుల సంక్షోభాలు, విదేశీ అప్పులు, ఆర్థిక మాంద్యాలు, అంతరాష్ట్ర సంక్షోభాలు, నిరుద్యోగ సమస్యలు, అంటు వ్యాధులు ప్రబలడం, మానసిక అనారోగ్యాలు లాంటి సమస్యలను ప్రపంచ మానవాళి ఎదుర్కోనున్నది.
రానున్న 10 ఏండ్లలో వాతావరణ మార్పులను అదుపు చేయకపోవడం, వాతావరణ మార్పుల అనుసరణలో వైఫల్యం, అసాధారణ వాతావరణ ప్రకోపాలతో ప్రకృతి విపత్తులు, జీవవైవిధ్య విధ్వంసాలు, జీవ వ్యవస్థలు కుప్పకూలడం, అసంకల్పిత వలసలు, సహజ వనరుల్లో కొరతలు, పౌర సమాజ ప్రమాదకర విచ్ఛిన్నం, సైబర్ నేరాల వెల్లువలు, భౌగోళిక ఆర్థిక ఘర్షనలు, పర్యావరణ విచ్ఛిన్న ప్రమాద ఘటనలు, డిజిటల్ శక్తి కేంద్రీకరణలు, అంతరాష్ట్ర/దేశ విభేదాలు, అప్పుల కుప్పలు, దీర్ఘకాలిక వ్యాధులు, టెక్నాలజీ దుష్ప్రభావాలు, నిరుద్యోగ పెరుగుదల, అంటువ్యాధులు ప్రబలడం, మానవ విధ్వంసకర ఆయుధాల దుర్వినియోగం, అక్రమ ఆర్థిక లావాదేవీలు, తీవ్రవాద సమస్యలు లాంటివి ప్రపంచ మానవాళినా ఆహ్వానిస్తున్నాయని తెలుసుకోవాలి.
సామాజిక మాద్యమాల వేదికగా జరిగే దుష్ప్రచారాలతో సమాజంలో అశాంతి, ద్వేష హత్యలు, పౌర సంఘర్షణలు, తీవ్రవాదం/ఉగ్రవాదం పెరుగుతాయని తెలింది. ఇంటర్నెట్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలకు కంచెలు వేయడం, సామాజిక మాద్యమాలపై ఆంక్షలు/హద్దులు పెట్టడం, సైబర్ భద్రతకు చట్టాలు చేయడం తప్పనిసరి అవుతుందని నివేదిక వివరించింది. ఇజ్రాయిల్ – పాలస్తీనా, ఉక్రెయిన్ – రష్యా యుద్ధాల ప్రభావం ప్రపంచ దేశాల ఆర్థిక రంగాలపై ప్రతికూల ప్రభావాలు పడడం చూస్తున్నాం. ఇలాంటి మరి కొన్ని ఘర్షణలు జరిగితే ప్రపంచ మానవాళి భారీ మూల్యం చెల్లించడమే కాకుండా 3వ ప్రపంచ యుద్ధానికి కూడా దారి తీయవచ్చని అర్థం అవుతుంది. వాతావరణ మార్పుల కట్టడికి జీరో కార్బన్ ఉద్గార స్థితికి చేర్చడం మానవాళి ముందున్న తక్షణ కర్తవ్యమని తెలుసుకోవాలి. శిలాజ ఇంధనాల వినియోగం తగ్గించి పునరుత్పాదక తరగని ఇంధనాల వినియోగాన్ని పెంచడం సత్వరమే ప్రారంభం కావాలి.
జీవన వ్యయాలను తగ్గించడంతో, పవర్ కొరతను అధిగమించడం, ద్రవ్యోల్భణాన్ని అదుపు చేయడం, పోషకాహార భద్రత సాధించడం, కార్బన్ ఉద్గారాలను అదుపు చేయడం, విదేశీ/స్వదేశీ అప్పులను అదుపులో ఉంచుకోవడం, మానవ హక్కులను పరిరక్షించుకోవడం, విపత్తులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండడం, ప్రజారోగ్యాన్ని కాపాడకపోవడం లాంటి చర్యలను ప్రభుత్వాలతో పౌర సమాజం కూడా తీసుకొని రానున్న రోజుల్లో ప్రపంచ శాంతి గొడుగు మానవాళిని రక్షించాలని కోరుకుందాం. దీపం ఉండగానే భూగృహాన్ని కాపాడుకుంటూ, చేతులు కాలకముందే ఆకులు సిద్ధం చేసుకుంటూ ఆధునిక మానవుడు ఆలోచిస్తూ అడుగులు వేయాలని ఆశిద్దాం.

# కమ్యూనిస్టు యోధుడు జ్యోతిబసు



భారత రాజకీయ రంగంలో అగ్రశేణి నాయకుల్లో ఒకరైన జ్యోతిబసు భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సి స్టు) తొలితరం నాయకులు, మొదటి పోలిట్ బ్యూరో సభ్యులు. 23 సంవత్సరాలు వరసగా ఒకే రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ పాలనా అనుభవ శాలి. ప్రధాని కావడానికి అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ ఆదేశానుసారం దూరంగా నిలిచి క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన నిబద్దత కలిగిన ఆదర్శ నేత ఆయన. సీపీఎం కురువృద్ధుడు జ్యోతిబసు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు విరామం లేకుండా ముఖ్యమంత్రిగా సేవలం దించి చరిత్ర సృష్టించారు. పశ్చిమ బెంగాల్‌లో రైతాంగ కార్మికులను సమీకరించి రైతాంగ ఉద్యమాల్లో, పీడిత ప్రజల ఉద్యమాల్లో జ్యోతి బసుది పాత్ర మరువ లేనిది.
దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ ను బలోపేతం చేసి భూ సంస్కర ణలు అమలు చేసి కౌలుదారు లకు, కార్మికులకు రక్షణ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంగా బెంగాల్‌ను తీర్చిదిద్దిన పాలనా సంస్కరణ వాది జ్యోతిబసు. 1914 జూలై 8న కోల్‌కత్తాలో బెంగాలీ మధ్యతరగతి కుటుంబం లో జ్యోతి బసు...నిశికాంత్ బసు, హేమలతా బసు దంపతులకు జన్మించారు. స్థానికంగా కలకత్తా (నేటి కోల్‌కత) లోనే జ్యోతి విద్యా భ్యాసం చేశారు. ప్రెసిడెన్సీ కళా శాలలో బసు తన డిగ్రీ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 1935 లో ఇంగ్లాండు వెళ్ళారు. ఇంగ్లాండులో న్యాయ శాస్త్రంలో విద్యనభ్యసించే సమయంలో గ్రేట్ బ్రిటన్ కమ్యూ నిస్టు పార్టీ వైపు ఆకర్షితులై, రాజకీయాలపై ఆసక్తి పెంచు కున్నారు. 1938లో జవ హర్ లాల్ నెహ్రూ లండన్ పర్యటన సమయంలో సదస్సు నిర్వహణ బాధ్యతను జ్యోతి బసు తీసు కున్నారు సుభాష్ చంద్రబోస్ పర్యటన సమయంలో కూడా జ్యోతి బసు ఏర్పాట్లు చేసారు.
1940లో న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్‌గా అర్హత సాధించి, అదే సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చారు. 1944లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలలో పాలు పంచుకొని ఆ తరువాత యూని యన్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1946లో తొలిసారిగా బెంగాల్ శాసనసభకు ఎన్నికయ్యారు. బి.సి. రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో శాసనసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపో వడంతో అజయ్ ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ప్రభుత్వంలో 1967 నుండి 1969 వరకు పశ్చిమ బెంగా ల్ ఉప ముఖ్య మంత్రిగా వ్యవహ రించారు. 1972 లో రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, జ్యోతి బసు కూడా తన శాసనసభ స్థానంలో ఓటమి పాలైనారు. తర్వాత 1977 జూన్ 21 నుండి 2000 నవంబరు 6 వరకు నిరాటంకంగా జ్యోతి బసు వరుసగా 5 సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారు. తద్వారా దేశంలో ఒక రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు ముఖ్య మంత్రిగా కొనసాగిన రికార్డును కూడా జ్యోతి బసు నెల కొల్పారు. సి.పి.ఐ (ఎం) పోలిట్ బ్యూరో నిర్ణయం వల్ల 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని వదులు కున్నారు. 2000లో ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతి బసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించారు.

# జనసంఘ్ వ్యవస్థాపక బాధ్యులు

వి రామారావుగా సుపరిచితులైన వెంట్రప్రగడ రామారావు (12 డిసెంబర్ 1935 – 17 జనవరి 2016) నిబద్దత కలిగి న రాజకీయ నేత. 1956లో భారతీయ జన సంఘ్‌లో 21 ఏళ్ల ప్రాయంలో 1956లో రామారావు జనసంఘ్‌లో సభ్యు నిగా చేరి, జాతీయ కార్యవర్గ సభ్యునిగా కొన్ని సంవత్సరాలు పని చేశారు. తెలుగు రాష్ట్రాల్లో సంఘ్ విస్తరణకు కృషి చేశారు. జన సంఘ్ పేరుని 1980లో భారతీయ జనతాపార్టీగా మార్చగా, అనంతరం బీజేపీలో చేరారు. భార తీయ జనతా పార్టీ జాతీయ నాయకుడిగా ఎదిగి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, వరుసగా నాలు గు సార్లు హైదరాబాద్ పట్ట భద్రుల నియోజకవర్గం నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన మండలికి ఎన్నికయ్యారు. ఆయన తన చివరి టర్మ్‌లో కౌన్సిల్‌లో పార్టీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 1935 డిసెంబరు 12న ఆంధ్ర ప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెదపారు పూడి మండలం వెంట్రప్రగడలో ఒక తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి అప్పారావు హోమి యో వైద్యుడు కావడంతో కొంత కాలం పాటు మండవల్లిలో ఉన్నా రు. మచిలీ పట్నంలో గ్రాడ్యు యేషన్ పూర్తయ్యాక హైదరా బాద్ ఉస్మానియాలో ఎల్ఎల్‌బీ చేశారు. ఆయన వృత్తి రీత్యా న్యాయవాదిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. తమ కెరీర్ ప్రారంభంలో, ట్రేడ్ యూని యన్ కార్య క్రమాలలో చురుకుగా ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొ రేషన్, స్టేట్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్, సౌత్ సెంట్రల్ రైల్వేస్ వంటి అనేక రాష్ట్ర మరియు సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్‌లు, కార్పొరేషన్‌ల ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్‌లకు అధ్యక్షు లుగా పని చేశారు. ఉస్మానియా యూని వర్సిటీ సెనేట్ మెంబర్‌గా కూడా ఉన్నారు. 1966, 1972, 1978లో మూడు పూర్తి పర్యాయాలు, శాసన మండలి సభ్యునిగా పని చేయగా, 1984లో పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎన్నికైన తర్వాత నాలుగవ సారి శాసన మండలి రద్దు చేయబడింది. 1956లో జన్‌సంఘ్‌లో చేరిన రామారావు ఎమర్జెన్సీ సమయంలో కూడా జైలు పాలయ్యారు. 1992 – 96 మధ్య రెండు సార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ విభాగానికి అధ్యక్షుడిగా ఉన్నారు. సిక్కిం గవర్నర్‌గా భారత రాష్ట్ర పతిచే నియమించ బడ్డారు. అక్టో బర్ 25, 2002 నుండి అక్టోబర్ 25, 2007 వరకు సిక్కిం గవర్నర్‌గా పని చేశారు. పదవీ విరమణ తర్వాత హైదరాబాద్‌లో స్థిర పడ్డారు. రామారావు దీర్ఘకాలంగా అనా రోగ్యంతో 2016, 17 జనవరిన చికిత్స పొందుతూ మరణించారు.

# ఆ టైంలోపు టిఫిన్ చేయకపోతే డేంజరే?



చాలా మందికి ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసే అలవాటు ఉంటుంది. ఉదయం టిఫిన్ చేశాకా మధ్యాహ్నం భోజనం చేస్తుంటారు. అయితే కొందరు టిఫిన్ చేసే సమయ వేళలు పాటించరు. ఉదయం ఏ సమయానికి టిఫిన్ చేయాలి? సమయం దాటితో ఎలాంటి సమస్యలు వస్తాయన్న విషయం పెద్దగా పట్టించుకోరు. ఉదయం టిఫిన్ చేయడానికి ఓ టైమ్ అంటూ ఉంటుంది. ఆ సమయంలో లోపు చేయడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. చాలా మంది ఈ బ్రేక్ ఫాస్ట్‌ను ఆలస్యంగా చేస్తుంటారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలలోపు9 ఆల్పాహారం చేయాలంటున్నారు నిపుణులు. ఉదయం అల్పాహారంపై ఐఎస్ గ్లోబస్ అధ్యయనం చేపట్టింది. ఇందులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఉదయం 8 గంటల్లోపు తినేవారితో పోలిస్తే 9 గంటల తర్వాత టిఫిన్ చేసేవారిలో డయాబెటిస్ ముప్పు 59 శాతం ఉన్నట్లు తేలింది. తినే సమయ వేళలు శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. వేళపాల లేకుండా టిఫిన్ చేస్తే రక్తంలో గ్లూకోజు, కొలెస్ట్రాల్ మోతాదు వంటి వాటిపై ప్రభావం ఉంటుందట. అలాగే రాత్రి 10 గంటల తర్వాత భోజనం చేసేవారిలో మధుమేహం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అధ్యయనం ద్వారా గుర్తించారు. మధుమేహం అనేది దీర్ఘకాలిక వ్యాధి. ఇది ప్రపంచవ్యాప్తంగా వేగంగా వ్యాపిస్తోంది. భారతదేశంలో కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు దీని బారిన పడుతున్నారు. జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమలు తగ్గడం వల్ల అధిక రక్తంలో చక్కెర స్థాయికి సంబంధించిన ఈ వ్యాధి పెరుగుతుంది. ఇది అటువంటి వ్యాధి, బాధితురాలిగా మారిన తర్వాత జీవితాంతం మందులపై ఆధారపడతారు. అందువల్ల, మధుమేహాన్ని నివారించడానికి, అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, ఆరోగ్యకరమైన అలవాట్లను అనుసరించడం. ఇది కాకుండా, మధుమేహాన్ని సరైన సమయంలో గుర్తించినట్లయితే, అప్పుడు ఈ వ్యాధి సమస్యలు సంభవించే ముందు నివారించవచ్చు. అందుకే ఆహారం తీసుకోవడంలో సమయ వేళలు పాటించడం చాలా ముఖ్యం. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలోని పోషక విలువలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచిస్తున్నారు నిపుణులు. మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ నిండుగా, పోషకాలతో ఉండాలని నిపుణులు అంటున్నారు.

# చక్కెర ఎక్కువ తీసుకుంటే...?



ఈ రోజుల్లో మనలో చాలా మంది జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ వంటి కలుషితమైన ఆహారాలు ఎక్కువగా తినడం వల్ల ఎన్నో లేని పోనీ అనారోగ్య సమస్యల్ని కొని తెచ్చుకుంటున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మన శరీరానికి ఖచ్చితంగా పోషకాలు కావాలి. వాటిని ఖచ్చితంగా సరైన మోతాదులో తీసుకుంటే ఎంతో ఆరోగ్యంగా, అందంగా ఉంటారు. కొంత మందిని గమనిస్తే చాలా ఆరోగ్యంగా యంగ్‌గా కనిపిస్తారు. ఎందుకంటే అందుకు కారణం వారి ఆహారపు అలవాట్లు. మంచి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే.. మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇక ఈ కోవలోనే చక్కెర కూడా చేరుతుంది. మనలో చాలా మందికి కూడా తీపి ఎక్కువగా తినడం ఇష్టం. ఇక షుగర్ మన శరీరానికి అవసరమే అయినా.. దీన్ని ఎక్కువగా తీసుకుంటే మాత్రం ఖచ్చితంగా లేని పోని రోగాలు రావడం ఖాయం. డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాల ప్రకారం.. పెద్దలు, పిల్లలైనా తక్కువ మోతాదులో చక్కెర తీసుకోవడం వల్ల వారికి ఖచ్చితంగా అదనపు ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఇక ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన ఈ సూచన వెనక ఎన్నో శాస్త్రీయ ఆధారాలు కూడా ఉన్నాయి. చక్కెర కంటెంట్‌ని ఎక్కువగా తీసుకుంటే చాలా రకాల జబ్బులు వస్తాయి. అవేంటో ఇప్పుడు మనం పూర్తిగా తెలుసుకుందాం. చక్కెరను ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో హార్మోన్లు ఇన్ బ్యాలెన్స్ అవుతాయి. దీని వల్ల ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఇమ్యూనిటీ లెవల్స్ కూడా తగ్గిపోతాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధి అయిన డయాబెటీస్ ఎటాక్ చేస్తుంది. మనం చక్కెరను ఎక్కువగా తీసుకుంటూ ఉంటే పదే పదే చక్కెర ఎక్కువగా తినాలనే కోరిక కలుగుతుంది. ఇది వ్యసనంలా మారిపోతుంది. ఇది ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. రక్తంలో కూడా చక్కెర స్థాయిలు పెరగడం, తగ్గడం వల్ల అలసటగా అనిపిస్తుంది. ఆహారంలో చక్కెరను ఎక్కువగా తీసుకుంటే.. చర్మ సమస్యలు కూడా ఎక్కువ అవుతాయి. చక్కెరను ఎక్కువగా తీసుకోవడం వల్ల పింపుల్స్, వృద్ధాప్యం, చర్మం డల్‌గా మారతుంది. దీంతో వయసు పైబడిన వారిలా కనిపిస్తారు. చక్కెరని ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు పెరుగుతుంది. దీని వల్ల అకస్మాత్తుగా బరువు పెరుగుతారు. అకస్మాత్తుగా బరువు పెరగడం వల్ల మీ గుండె, కాలేయం రెండింటికీ మంచిది కాదు. అనారోగ్యకరమైన బరువు ఊబకాయానికి దారి తీస్తుంది.

# కొబ్బరి నీళ్లు మంచివే అని తెగ తాగేస్తున్నారా..



కొబ్బరి నీరు వల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. అందుకే వైద్యులు హెల్త్ బాగో లేనప్పుడు నీరసంగా ఉంది అన్నప్పుడు వెంటనే కొబ్బరి నీళ్లు తాగమని సూచిస్తూ ఉంటారు. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అంతేకాకుండా వీటిని తాగడం వల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల కొన్ని రకాల సమస్యలకు చెక్ పెట్టవచ్చు. ఈ నీటిలో ఎలక్ట్రోలైట్లు, విటమిన్లు, ఖనిజాలు శరీరానిక ఎంతో మేలు చేస్తాయి. ప్రతిరోజూ కొబ్బరి నీరు తాగడం వల్ల రోగనిరోధక వ్యవస్థ మెరుగుపడుతుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడవు. అయితే కొబ్బరినీరు ఆరోగ్యానికి మంచిదే కదా అని ఎక్కువగా తీసుకుంటే మాత్రం సమస్యలు తప్పవు. మోతాదుకు మించి తాగితే కొన్ని రకాల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి అంటున్నారు వైద్యులు. మరి కొబ్బరి నీరు ఎక్కువగా తాగితే ఏం జరుగుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. కొబ్బరి నీరు మోతాదుకు మించి తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, ఉబ్బరం, విరేచనాలు వంటి జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. అలాగే జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారు కొబ్బరి నీటిని మితంగా తీసుకోవాలి. ఇక కొందరికి కొబ్బరి నీటిని తాగడం వల్ల అలర్జీ సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయి. కాబట్టి కొందరిలో కొబ్బరి నీరు దద్దుర్లు, దురద, వాపులకు దారితీస్తుంది. కొబ్బరి నీళ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. దీంతో కొబ్బరి నీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తంలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. కిడ్నీ సమస్యలతో బాధపడే వారు కొబ్బరి నీటిని మోతాదుకు మించి తీసుకోకూడదు. కిడ్నీ సమస్యలతో ఇబ్బంది పడేవారు వైద్యుల సూచన మేరకే కొబ్బరి నీరును తీసుకోవాలి.

# అరటిపండును తినేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

మనలో చాలా మంది కూడా చలికాలంలో అరటిపండును తీసుకోవడానికి కూడా భయపడుతూ ఉంటారు. ఎందుకంటే ఇవి చల్లగా ఉంటాయి కాబట్టి చలికాలంలో అరటిపండును తీసుకోవడం వల్ల దగ్గు, కఫం వంటి సమస్యలు వస్తాయని చాలా మంది చాలా రకాలుగా భయపడతారు. అసలు మనం చలికాలంలో అరటిపండును తీసుకోవచ్చా.. చలికాలంలో అరటిపండును తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చలికాలంలో అరటిపండును తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ చలికాలంలో అరటిపండును తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వారు చెబుతున్నారు. చలికాలంలో మన శరీరంలో జీర్ణక్రియ కూడా నెమ్మదిగా ఉంటుంది. అలాంటప్పుడు అరటిపండును తీసుకోవడం వల్ల దానిలో ఉండే ఫైబర్ జీర్ణశక్తిని మెరుగుపరచడంలో చాలా బాగా సహాయపడుతుంది. అరటిపండ్లు చల్లటి ఆహారాలు. వీటితో మిల్క్ షేక్స్ వంటి మరింత చల్లటి ఆహారాలను తయారు చేసి తీసుకోకూడదు. దీంతో ఇన్ఫెక్షన్ లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చలికాలంలో అరటిపండ్లను తీసుకున్నప్పటికి మితంగా తీసుకోవాలి. వీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల దగ్గు, జలుబు, ఉబ్బసం, కఫం,శ్లేష్మం వంటి సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే రాత్రిపూట అరటిపండ్లను తీసుకోకపోవడమే మంచిది. ముఖ్యంగా శ్వాస సంబంధిత సమస్యలు ఉన్న వారు అస్సలు తీసుకోకకూడదని నిపుణులు చెబుతున్నారు. చలికాలంలో ఎముకలు విరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చలికాలంలో అరటిపండ్లను తీసుకోవడం వల్ల ఎముకల సాంద్రత పెరగడంతో పాటు ఎముకలు ధృడంగా తయారవుతాయి. అదే విధంగా చలికాలంలో చాలా మందికి ఎప్పుడూ నీరసంగా ఉన్నట్టు అనిపిస్తుంది. కనుక అరటిపండును తీసుకోవడం వల్ల శరీరానికి తగినంత శక్తి లభిస్తుంది. నీరసం, బలహీనత దరి చేరకుండా ఉంటాయి. చలికాలంలో వీటిని మధ్యాహ్న సమయంలో తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.



# అన్నారం గ్రామంలో ఘనంగా రాముల వారి అక్షింతలు శోభా యాత్ర



**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** తాండూర్ మండలం అన్నారం గ్రామంలో సోమవారం శ్రీరామ తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీ రాముల వారి అక్షింతల శోభా యాత్ర అన్నారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. యువకులు, మహిళలు, రామనామ కీర్తనలతో, కోలాటాలతో, జై శ్రీరాం అంటు నినాదాలతో, భక్తి శ్రద్దలతో శ్రీరాముల వారి అక్షింతనలను పల్లకిలో మోసికెల్లి, గడప గడపకు అయోధ్య శ్రీరామ తీర్త అక్షింతలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విశేషంగా ఆకర్షించిన బొమ్మల కొలువు

**- సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాటు**



**వాస్తవ నేస్తం,వైరా:** మున్సిపాలిటీ పరిధిలోని మండలంలోని గ్రామాలలో విశేషంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి ఈ పండుగలలో బొమ్మలు కొలువులది ఒక ప్రత్యేక ఆకర్షణ. బాలికల్లోని అజ్ఞాత కళాభివృద్ధి బయటపడే విధంగా బొమ్మలు కొలువును ఏర్పాటు చేశారు. బొమ్మల కొలువుల్లో పక్షులు పండ్లు జంతువులు ప్రకృతి తదితర బొమ్మలు కొలువులో ఉన్నాయి. అందంగా కళాత్మకంగా అమర్చిన బొమ్మలకు పేరంటానికి బంధువులు మిత్రులును పిలిచి సంతోషంగా బొమ్మలు కొలువులను పిల్లల అమర్చిన బొమ్మలు ఆకట్టుకున్నాయి. భక్తి త్యాగం స్నేహం సమానత్వం శ్రద్ధ పెంచడమే ఈ పండుగల అంతరార్థం రాను రాను బొమ్మల కొలువు సాంప్రదాయాలు తగ్గుముఖం పడుతూ వస్తున్న తరుణంలో చిన్నారులు పెట్టిన బొమ్మల కొలువు విశేషంగా ఆకర్షించింది. శివాలయం అర్చకులు సతీష్ కుమార్ చార్యులు మాట్లాడుతూ.. సకల దేవతల స్వరూపమే మీ బొమ్మలు కొలువని బాలికలే ప్రత్యేకంగా చేయడం అనేది కారణంఉందని గోదాదేవి పూజ చేసి గొబ్బిళ్లు తొక్కి పాటల పాడి అలా చేస్తే ఆ సర్వ శబ్దాలకు వారికి గోదాదేవి అనుగ్రహం కలుగుతుందని తద్వారా పిల్లలకు సకాలంలో పెళ్లి అయ్యే యోగం కలుగుతుందన్నారు. ఇదివరకటి కాలంలో ఇవన్నీ ఇంట్లో చేసుకునే వాళ్ళమని పంటలు గురించి దేవతల బొమ్మలు రైతులు వి అమ్మవారిని పెట్టే వారిని ఒక దీన్ క్రియేట్ చేసి పెట్టడం వలన మన క్రియేటివిటీ కూడా బయటపడుతుందని ఇప్పుడేమో బయట షాపుల్లో కొని తెచ్చి పెడుతున్నారని ఒక బాలిక తల్లి వివరించారు.

## సొంత ఖర్చులతో రోడ్డుపై గుంతలు పూడ్చిన గంగాధర్



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండలంలోని వట్టోలి గ్రామం నుండి రాయపూర్ కాండ్లీ వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పడి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతు న్నారు. ఇది గమనించిన కారగిరి గంగాధర్, సోమవారం శ్రమదానం చేశారు. రోడ్డుపై ఉన్న గుంతలను మట్టితో పూడ్చివేశారు. కారగిరి గంగాధర్, మాట్లాడు తూ... వాట్టోలి నుంచి రాయపూర్ కా%శీ%డ్లీ వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలతో కార్మికులు, ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. వారం రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు కింద పడి గాయాలపాలయ్యారన్నారు. దీంతో శ్రమదానం చేసి 20 వేల సొంత ఖర్చులతో రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చినట్లు తెలిపారు. దీంతో అటువైపు నిత్యం వెళ్లే పలు గ్రామాల ప్రజలు గ్రామస్తులు పలువురు అభినందించారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండలం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్ట ర్లను మంగళవారం ఎస్సై సాయికుర్ పట్టుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాతూ... ఎలాంటి అనుమతులు లేకుండా తరలిసున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామని తదరి చర్య లకు ఎమ్మార్వోకు అప్పగిస్తామని తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకతరలిస్తే చట్టరీ త్యచర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది, రామారావు తదితరులు ఉన్నారు.

# వైరా లో ఘనంగా సంక్రాంతి వేడుకలు - అయ్యప్ప క్షేత్రంలో జ్యోతి దర్శనం





**వాస్తవ నేస్తం,వైరా:** పట్టణంలో మున్సిపాలిటీ పరిధిలో సంక్రాంతి పండుగ ఘనంగా జరుపుకున్నారు ఇంటిముందు ముగ్గులు వేసి గొబ్బెములు పేర్చారు పిండి వంటలు చేశారు. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని రైతులు గోవులను పూజించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సంస్థలు కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు. గొబ్బెమ్మలతో రథం ముగ్గులు వేసి రంగులతో రంగవల్లులు దిద్దారు. కనుమ పండుగ నాడు గ్రామాల్లో ఎద్దులను ప్రత్యేకంగా అలంకారం చేశారు. వాటికి పూలదండలు వేసి రకరకాలైన ఆభరణాలు తొడిగి మంచి పొంగలి ఉండి ప్రత్యక్ష నివేదనగా ఆ ఎద్దు చేత తినిపించారు భోగి రోజు భోగి మంటలు వేశారు. వైరా హరిహర అయ్యప్ప క్షేత్రంలో సంక్రాంతి నాడు 18 కేజీల కర్పూరంతో స్వామివారి జ్యోతి దర్శనం భక్తులకు చూపించారు. సంక్రాంతి సందర్భంగా అలంకరణ చేసిన ఆభరణాలను వైరా పట్టణ పురవీధుల్లో ఊరేగింపు చేసి అయ్యప్ప క్షేత్రానికి తీసుకొని వచ్చారు. అనంతరం స్వామివారికి చేయించిన ఆభరణాలను అలంకరణ చేయడం అత్యంత వైభవ్వేతంగా జరిగింది. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదములు అందించారు. స్వామి జ్యోతి దర్శనం చూసి భక్తులు పులకించిపోయారు. అయ్యప్ప క్షేత్రంలో ఉన్న అన్ని దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకములు ప్రత్యేక పూలతో అలంకరణ గోత్రనామరిచిన పూజలు సువర్ణ పుష్పార్చన పూజలు జరిపారు.

# సంక్రాంతి సంబరాల్లో మెరిసిన జిల్లా నాట్య కళాకారిణి

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** సంక్రాంతి పండగను పురస్కరించుకొని నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ మరియు సిరి ఆర్ట్స్ అకాడమీ వారు సంయుక్తంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు-2024 వేడుకల్లో జిల్లా కేంద్రానికి చెందిన నాట్య కళాకారిణి చుక్కబొట్ల కావ్య ప్రతిభ కనబర్చారు. పట్టణంలోని చించర్ వాడ కాలానీకి చెందిన చుక్కబొట్ల కావ్య హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో మంగళవారం జరిగిన ఉత్సవాల్లో కూచిపూడి విభాగంలో బ్రహ్మాంజలి పాట పై ప్రదర్శించిన నృత్యానికి గాను నాట్య మయురీ అవార్డు వరించింది. ఈ మేరకు నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కాగా శిక్షకురాలు ఏకవీర శిష్యరికంలో ఆమె నాట్యాన్ని ప్రదర్శించారు. దీంతో ఆమెను పలువురు అభినందించారు. ఆమె వెంట వారి కుటుంబ సభ్యులు చుక్కబొట్ల విజయ,నవీన్,గంగాధర్,శ్రావ్య తదితరులు ఉన్నారు.





# జయ శంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమైన విషయం

**కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్**

**వాస్తవ నేస్తం,కూకట్‌పల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం 124 డివిజన్ ఆల్విన్ కాలనీ పరిధిలోని ఎల్లమ్మబండలో గల తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, తెలంగాణ ఆత్మగౌర వాన్ని తట్టిలేపిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విగ్రహాన్ని ఒక గుర్తు తెలియని వ్యక్తి ధ్వంసం చేయడం జరిగింది. మద్యం మత్తులో ఊగుతూ, పిచ్చి పిచ్చి గెంతులు వేస్తూ, పెద్ద బండరాయితో జయశంకర్ విగ్రహాన్ని పగలగొట్టి పైశాచిక ఆనందం పొందాడు. ఈ విషాదకరమైన సంఘట నను ఖండిస్తూ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని పగలగొట్టటం బాధాకరమైన విషయం అని, ఇటువంటి విషాదకరమైన సంఘటన జరిగినందుకు చింతిస్తున్నమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదినర ఏళ్ల పాలనలో చిన్న చిన్న పొరపాట్లు కూడా జరగకుండా జాగ్రత్త పడ్డామని, విగ్రహాన్ని పగలగిట్టిన వ్యక్తి ఎవరైనా సరే కఠినంగా శిక్షించాలని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో పార్టీలకు అతీతతంతంగా మహాత్మాగాంధీ, ఇందిర గాంధీ, ఎన్టీఆర్ వంటి ఎంతోమంది మహానుభావుల విగ్రహాలను ఆల్విన్ కాలనీ డివిజన్ లో ప్రతిష్టించడం జరిగింది అని గుర్తుచేశారు. పోలీస్ శాఖ వారు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పారదర్శకంగా దర్యాప్తు చేసి నిందుతుణ్ణి విచారించాలని స్థానిక పోలీస్ స్టేషన్ లో కంప్లైయింట్ ఇవ్వడం జరిగింది అన్నారు. జరిగిన దురదృష్టకరమైన సంఘటనకు తెలంగాణ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని యధాస్థానంలో పునఃప్రతిష్టించి తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రొఫెసర్ జయశంకర్ అభిమానులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, RNI NO: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com